# అనగనగా... ఒక కథ

శ్రీలక్ష్మి టూరింగ్ టాకీసు, ఆత్రేయపురం.

ఆపరేటర్ రంగయ్య ముందే వచ్చి కూర్చున్నాడు.

ఆవేళ కొత్త సినిమా విడుదల. మధ్యాహ్నం బాక్సలు వచ్చేశాయి. ఆనవాయితీ ప్రకారం అగరొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు దిష్టి తీసి, కొట్టి, రీళ్లు చక్రాలకెక్కించాడు.

పదేళ్ల క్రితం మంచి హిట్టయిన సినిమాయే.

టాప్ ఫుల్ కలెక్షన్ అవుతుందనుకుంటున్నాడు ఓనర్ వెంకట్రాజు.

"ఒకసారి వేసి చూద్దాం! ప్రింట్ బాగా పాతగా ఉంది!" అన్నాడు రంగయ్య.

"దాటేంటి?" వెంకట్రాజు హుకుం.

"అయ్యా! ఎక్కడెక్కడ తిరిగొచ్చిందో బాక్స్..! ఓసారి మనం రన్ చేసుకుంటే - ఫిల్మ్ ఎక్కడయినా కట్ ఐనా - సరిచేసుకోవచ్చు కదా!"

"సరే..! కానీయ్.. నువ్వు కార్బన్లు దండగయ్యే పన్లు చేస్తుంటావ్... ఔను రంగయ్యా! ఫిలిం కరెక్టుగా ఉందో లేదో చూసుకోవాలని నువ్వు అనుకుంటావ్ గానీ - దాని వల్ల ఎంత కరెంటు కాలుతుందో ఆలోచించవేంటయ్యా!"

"చూడండి రాజుగారూ! సినిమా నడుస్తుండగా బొమ్మ కట్ ఐతే మన హాలు పరువుపోద్ది! నీదే తప్పని మీరంటారు. ఓ పాలి మనం చూసేసుకున్నామనుకోండి.. అళ్లు నంబరింగ్ తప్పు పెట్టినా- మనం కరెక్టుగా సిన్మా చూపించొచ్చు. నా మాటిని కూకోండీ! ఎనౌన్స్‌మెంట్ ఇచ్చే కిట్టిగాన్ని కూడా సూడమందాం. సిన్మా చూస్తే ఆడు మంచిగా సెప్తాడు."

"నువ్ తెలివైనోడివేరా!"

"మరేటండీ.. రాయమండ్రి కన్యా టాకీసులో పన్జేస్తాను.. అసిస్టెంట్‌గానే అనుకోండి... మా ఆపరేటర్ ఎప్పుడూ జోగుతుండేవాడు - ఆడికి సిన్మా ఆగితే మెలకువ వస్తది - మనకు సిన్మా ఐపోతేగానీ నిద్రరాదు"

## హీరో

* * *

రంగయ్యకి సినిమా పిచ్చి ఎక్కువే.

పిచ్చనకూడదు గానీ.. ప్రేమ అనాలి.

ప్రతీ సినిమాలోనూ హీరో చేసే మంచి పనులు, చెడ్డవాళ్లని ఎదిరించడానికి చేసే ఫైటింగ్‌లు - ప్రేమలూ - త్యాగాలూ, హీరోయిన్లతో సరాగాలూ, సరసాలూ ఎన్ని వందల సార్లు చూశాడో..

అసిస్టెంట్‌గా ఉన్నప్పట్నుంచీ-

ఆపరేటర్‌గా మారినప్పట్నుంచీ - ప్రొజెక్టర్ గిర్రుమంటున్నా కథ, మాటలు, యాక్షన్ గట్రా బుర్రలోకి దిగుతూ ఉండేవి.

"మనం కూడా హీరో అయిపోవచ్చు గదా" అని ఆశ కలుగుతుండేది.

హీరోలా మంచి వాడులా ఉంటే - అందరూ ఎంత మెచ్చుకుంటారో అర్థం చేసుకున్నాడు.

అందుకే తన్లో తను హీరోను చూసుకున్నాడు.

తను కూడా అన్యాయాల్ని ఎదిరించి న్యాయాన్ని గెలిపించి అందమైన సావిత్రో, వాణిశ్రో, శ్రీదేవో, జయప్రదో లాంటి అమ్మాయి తన్ను మెచ్చుకు పెళ్లాడాలని అనుకునేవాడు.

తన ఊహకు తనకే నవ్వొచ్చేది.

తనో పూట పని మానేస్తే సిన్మా ఆట ఆగిపోతుంది.

'ఇంక దుర్మార్గుల వేట - హీరోయిన్లతో పాటు ఎలా కుదురుతుంది?' అనుకుని బొబ్బర్లంక సుబ్బలక్ష్మిని పెళ్లి చేసుకున్నాడు.

పెళ్లినాటి రాత్రి పెళ్లాన్ని గొప్పగా క్యాబిన్లో కూర్చోపెట్టి సినిమా చూపెట్టాడు.

రాజుగారు కూడా ఏమనలా!

"నీకు చీరలు నగలు ఎట్టి సంతోషపెట్టలేను గానీ కొత్త సినిమా పెతీ ఆట టిక్కెట్ లేకుండా సూపించగలనే. రెండో ఆటయ్యాక ఇంటికొస్తాను - అంతవరకూ నువ్వు నాతో కూకుంటానూ అంటే అలాగే..." అన్నాడు సుబ్బలక్ష్మితో.

"అక్కర్లేదు! అత్తయ్య తోడుంటుంది గదా నేను ఒకే సినిమా పదిసార్లు చూడలేను. నువ్వెప్పుడొస్తే అప్పుడు లేస్తా- అందాకా పడుకుంటాను- నువ్వొచ్చాకే ముద్దులూ ముచ్చట్లూ సిన్మా చూసొచ్చిన మూడ్‌లో ఫైట్లూ గీట్లూ అనకు - డ్యూయెట్లు చాలు" అంది కొత్త పెళ్లాం సుబ్బలక్ష్మి.

* * *

"మన పిల్లాణ్ని - హీరో అంతవాణ్ని చెయ్యాలే. అన్యాయాన్ని డిష్యూం డిష్యూం చేసి న్యాయాన్ని గెలిపించి - వీడు హీరో అవ్వాలి" అన్నాడు రంగయ్య... పొత్తిళ్లలో ఉన్న బుజ్జి నాగేశ్వర్రావుని ముద్దుపెట్టుకుంటూ.

**హీరోలు మారిపోతున్నారు. కొడుకు పేరు మార్చేద్దామని చాలాసార్లు అనుకున్నాడు. రంగయ్యకి కావల్సిందొక్కటే తన కొడుకు హీరో అవ్వాలి. హీరో అంటే తెరమీద హీరో కాదు జనం గుండెల్లో హీరో. అతనికి ఆశ ఉంది గానీ దానికి హద్దులూ ఉన్నాయి. ఇంటికి హీరో అవ్వొచ్చు - వీధికి హీరో అవ్వొచ్చు - ఊరికి హీరో అవ్వొచ్చు.**

"పేరేం పెడదామా" అని భార్యాభర్త ఇద్దరూ రామారావూ, నాగేశ్వర్రావ్, చిరంజీవి, శోభన్ బాబు, కృష్ణ ఇవన్నీ అయ్యాక - ఎవర్ గ్రీన్ హీరో నాగేశ్వర్రావ్‌ని ఖాయం చేశారు.

ఇప్పుడే సినిమా చూస్తున్నా - రంగయ్యకొకటే థాట్.

సినిమాలన్నీ చాలా ఫాస్ట్ ఐపోతున్నాయి.

హీరోలు మారిపోతున్నారు.

కొడుకు పేరు మార్చేద్దామని చాలాసార్లు అనుకున్నాడు.

రంగయ్యకి కావల్సిందొక్కటే తన కొడుకు హీరో అవ్వాలి.

హీరో అంటే తెరమీద హీరో కాదు జనం గుండెల్లో హీరో.

అతనికి ఆశ ఉంది గానీ దానికి హద్దులూ ఉన్నాయి.

ఇంటికి హీరో అవ్వొచ్చు - వీధికి హీరో అవ్వొచ్చు - ఊరికి హీరో అవ్వొచ్చు.

కానీ....

'ధర్మం కోసం పోరాడే హీరో అవ్వాలి నా కొడుకు' అనుకుంటూ.

కొత్త సినిమా హీరోల్ని తన కొడుకులో ఊహించుకుంటూ కలర్ సినిమాల్ని నడిపిస్తూ టూరింగ్ టాకీసులోనే కలలు కంటున్నాడు.

* * *

టూరింగ్ టాకీసు ఓనర్ వెంకట్రాజు క్యాబిన్‌లో ఉన్న రంగయ్యని అర్జెంటుగా ఆఫీసులోకి రమ్మని కబురుపెట్టాడు.

వెంకట్రాజు టెన్షన్‌గా ఉన్నాడు.

"రంగయ్యా! మీ అబ్బాయి ఏం చదివాడు?"

"ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు" అన్నాడు రంగయ్య.

"మనిషి ఎలాటోడు?"


"హీరోలాంటోడండి.. ఎందుకడుగుతున్నారు?"

"మీ వాడు మర్డర్ చేసి జైలుకెళ్లాడు. మీ ఆవిడ కంగారుపడుతూ ఫోన్ చేసింది"

రంగయ్య షాకయ్యాడు.

హీరో అవ్వాలనుకున్న కొడుకు మర్డర్ చేసి విలన్ అయ్యాడా? అతని కళ్లు జలజలా వర్షిస్తున్నాయి.

"కోటిలింగం కొడుకుని చంపేశాట్ట" అన్నాడు వెంకట్రాజు.



"నా కొడుకు విలనయ్యాడా?" అనుకున్న రంగయ్య కోటిలింగం కొడుకును చంపాడన గానే కళ్లు తుడుచుకున్నాడు.

"ఐతే నా కొడుకు హీరోనే! విలన్ కాదు"

కోటిలింగం కొడుకు పెంటయ్య నిజంగా పరమదుర్మార్గుడు.

వయసుకు మించిన దుర్మార్గాలు ఎన్నో చేశాడు.అన్నిటితో పాటు పదో తరగతి చదువుతున్న రంగయ్య కూతురిని పాడుచేయటానికి పెద్ద కుట్ర చేశాడు.

అది గమనించిన రంగయ్య కొడుకు నాగేశ్వర్రావ్ ఆ చీడపురుగుని ఏరివేసి చంపేశాడు.

"ఎంత మంచి పని చేశాడయ్యా మీ అబ్బాయి.. ఓ ఆడ పిచ్చోడిని అంతమొందించాడు. నీ కొడుకు హీరో" అన్నాడు వెంకట్రాజు.

వెంకట్రాజు మాటల్లో అర్థం లేకపోలేదు.

తనకి ఐనవాళ్లని కూడా ఎరవేసిన వ్యక్తిని అంతం చేయడం - నాగేశ్వర్రావ్ చేసిన మంచి పని అని మెచ్చుకున్నాడు.

* * *

వెంకట్రాజుతో కలిసి పోలీసు స్టేషన్‌కు వచ్చాడు రంగయ్య.

కొడుకు తలదించుకు నిల్చున్నాడు.

కన్నతండ్రి అతన్ని కౌగిలించుకుని-

"ఒరేయ్ నాన్నా! నువ్వు హీరోవిరా! ఒక దుర్మార్గుణ్ని అంతం చేశావు - ఊరంతా నిన్నెంత 'ఓహో' అంటోందో తెలుసా?" అని కన్నీళ్లు కార్చాడు.

"ఈ కన్నీళ్లు - ఆనందబాష్పాలురా!"

☆